MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 363 | గురువారం 18 డిసెంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-



# ఉద్యమానికి నాంది!

**కోటి సంతకాల ప్రతులతో కూడిన వాహనాలు లోక్‌భవన్‌కు తరలింపు**

**జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన మాజీ సీఎం జగన్**

**ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై జోక్యం చేసుకోవాలని గవర్నర్‌కు విన్నవించిన వైఎస్ జగన్**

(అంకుశం, అమరావతి, డిసెంబర్ 18):

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్ఆర్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి అండగా నిలిచారు. తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం వద్ద శుక్రవారం కోటి సంతకాల ప్రతులతో కూడిన వాహనాలను వైయస్ జగన్ మోహన్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించి లోక్ భవన్‌కు పంపించారు. అన్ని జిల్లాల నుంచి తాడేపల్లికి చేరుకున్న కోటి సంతకాల సేకరణ ప్రతుల వాహనాలు ఈ కార్యక్రమంలో ప్రత్యేక - మిగతా2లో

## చంద్రబాబు గ్రాఫ్ డౌన్.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

**దాన్ని కలెక్టర్లపై నెడుతున్న చంద్రబాబు**

**అధికారంలోకి వస్తాం.. స్కామ్‌కు పాల్పడిన వారిని జైలుకు పంపుతాం**

**చంద్రబాబు పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం**

**వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంలో వైయస్ జగన్**





# సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు



**కలెక్టర్ల సదస్సులో స్టాండింగ్ ఓవేషన్**

**సీఎం చంద్రబాబుకు ఎకనామిక్ టైమ్స్ 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు**

**కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రికి స్టాండింగ్ ఓవేషన్‌తో అభినందనలు**

**ఇది దాదాగిరి కాదు, నాయుడుగిరి పాలన అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్య**

**ఈ ఘనత అధికారులదేనన్న సీఎం చంద్రబాబు**

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి**

అమరావతి

సీఎం చంద్రబాబుకు ప్రతిష్ఠాత్మక 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక 'ఎకనామిక్ టైమ్స్' ఈ అవార్డును ప్రకటించిన విషయాన్ని కలెక్టర్ల సదస్సులో మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ ప్రకటన వెలువడగానే సదస్సులోని మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు తమ స్థానాల్లోంచి లేచి నిలబడి (స్టాండింగ్ ఓవేషన్) ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడానికి కృషి చేస్తున్న - మిగతా3లో

# పీపీపీతో ప్రైవేట్ చేతుల్లోకి రాష్ట్రం! వైద్య రంగం

**విద్యా, వైద్య రంగాల ధారాదత్తం!!**


**సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజం**

అంకుశం ప్రతినిధి విజయవాడ డిసెంబర్ 18

రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలతో పాటు కీలక ప్రభుత్వ రంగ సంస్థలనూ ప్రైవేటీకరించే ప్రమాదకర విధానాలను ప్రభుత్వం అమలు చేస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను పబ్లిక్ -ప్రైవేట్-పార్టనర్‌షిప్ (పీపీపీ)పేరిట ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ప్రజా వ్యతిరేక చర్యని ఆయన దుయ్యబట్టారు. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలలను పీపీపీ విధానంతో చంద్రబాబు ప్రభుత్వం చేపడుతున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా సిపిఐ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం విజయవాడ ధర్నా చౌక్‌లో సీపీఐ విజయవాడ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పీపీపీ విధానాన్ని వెంటనే రద్దు చేసి, ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని, తక్షణమే ప్రభుత్వం జారీజేసిన జీవోలు రద్దు చేయాలని నేతలు నినదించారు. ఈ ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకునే వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. అనంతరం సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, ప్రభుత్వ భవనాలు, కేంద్ర ప్రభుత్వ అనుమతులతో నిర్మించిన వైద్య కళాశాలలను, చివరకు ప్రైవేటు - మిగతా2లో



# పోలీసింగ్ అంటే భయం ఉండాలి



**ఏపీలో తగ్గిన నేరాలు**

**గతంతో పోలిస్తే 5.5 శాతం తగ్గిన నేరాల రేటు**

**22 ఏ భూముల విషయంలో సర్వే చేసి సెటిల్ చేయండి**

**భూవివాదాలు సృషించేవారిపై అవసరమైతే పీడీ యాక్టు నమోదు చేయండి**

**జిల్లా ఎస్పీలు, కలెక్టర్ల సమావేశంలో సీఎం చంద్రబాబు**

*రాష్ట్రంలో శాంతిభద్రతలే ప్రభుత్వానికి ముఖ్యమని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గురువారం రాజధాని అమరావతిలో జిల్లా కలెక్టర్ల సదస్సులో శాంతిభద్రతలపై జిల్లా ఎస్పీలు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కొన్ని జిల్లాల్లో క్రైమ్ రేటు ఎక్కువగా ఉందని.. మరికొన్ని చోట్ల తక్కువగా ఉందన్నారు. కడప, అల్లూరి, ఏలూరు జిల్లాల్లో ప్రాపర్టీ సంబంధిత కేసులు ఎక్కువగా ఉండటానికి కారణం ఏమిటో విశ్లేషించాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు.*



అమరావతి

పోలీసింగ్ భయం ఉండాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. రెండో రోజైన కలెక్టర్ల సమావేశంలో గురువారం శాంతిభద్రతలపై జిల్లా ఎస్పీలు, కలెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో సీఎం పాల్గొన్నారు. అంతకుముందు శాంతిభద్రతలపై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో గతంతో పోలిస్తే 5.5 శాతం మేర నేరాల రేటు తగ్గిందని వెల్లడించిన డీజీపీ. మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాయి. 16 జిల్లాల్లో నేరాలు బాగా తగ్గాయి... మిగతా జిల్లాల్లో వేర్వేరు కారణాల వల్ల క్రైమ్ ట్రెండ్ పెరుగుతోందని వివరించిన డీజీపీ. అన్నమయ్య లాంటి జిల్లాలో మైగ్రేషన్ లేబర్ కారణంగా నేరాలు జరుగుతున్నాయని వివరించిన డీజీపీ. కిడ్నాపింగ్ లాంటి కేసులు తగ్గుముఖం పట్టాయన్న డీజీపీ. 56 శాతం మేర డిటెక్షన్ రేట్, 55 శాతం మేర రికవరీ రేటు ఉందన్న హరీష్ - మిగతా3లో

# పీపీపీతో ప్రైవేట్ చేతుల్లోకి రాష్ట్రం! వైద్య రంగం

-మొదటిపేజీ తరువాయి

వ్యక్తులకు కట్టబెట్టడం స్పష్టమైన ప్రైవేటీకరణేనని చెప్పారు. అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం పీపీపీ అంటే ప్రైవేటీకరణ కాదని చెబుతున్నప్పటికీ..వాస్తవంగా వేలాది కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను కొందరు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి అప్పగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఇప్పటికే విద్యారంగం పూర్తిగా ప్రైవేటీకరణ దిశగా వెళ్తోందన్నారు. ప్రాథమిక విద్యలో 70 శాతం, ఇంటర్మీడియట్ విద్యలో 80శాతం, ఇంజనీరింగ్ కళాశాలలలో దాదాపు 90 శాతం ప్రైవేటు విద్య సంస్థల ఆధీనంలో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను పక్కనపెట్టి గీతం, కేఎల్‌యూ, ఎస్‌ఆర్‌ఎం వంటి ప్రైవేటు విశ్వవిద్యాలయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. వైద్య రంగంలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోందని, ప్రభుత్వ వైద్యకళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం వల్ల పేద ప్రజలకు వైద్యం దూరమయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. ప్రభుత్వమే నిర్వహిస్తున్న ఎయిమ్స్ వంటి ఆసుపత్రులు విజయవంతంగా పనిచేస్తున్నప్పుడు, పీపీపీ విధానానికి ఎందుకు వెళ్తున్నారని అంటూ ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇది తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు చేస్తున్న ప్రయత్నమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీపీపీ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమం కొనసాగిస్తామని వెల్లడిరచారు. సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో వైద్య కళాశాలలకు సంబంధించిన జీవో నంబర్ 107, 108 ద్వారా పేమెంట్ సీట్ల విధానం తీసుకురావడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. దీనికి వ్యతిరేకంగా ఏఐఎస్‌ఎఫ్ ఉద్యమించిందని గుర్తుచేశారు. నాడు ప్రతిపక్షంలో కూటమి నాయకులు మేము అధికారంలోకి వస్తే ఈ జీవోలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు కొత్తగా జీవో నంబర్ 590 తీసుకువచ్చి వైద్య సీట్లను పూర్తిస్థాయిలో అమ్మకానికి పెడుతున్నారని విమర్శించారు. ఇది పేదవారి వైద్య విద్య హక్కును పూర్తిగా హరిస్తుందని అన్నారు. రాష్ట్ర మేధావుల ఫోరం నాయకులు చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్ర హక్కుల కోసం మొట్టమొదటగా పోరాడిందీ సీపీఐ పార్టీయేనని గుర్తుచేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనకై సీపీఐ ముందుండి



ఉద్యమాలు నిర్వహించిందన్నారు. ఈ ప్రైవేటీకరణ విధానాల వల్ల రాష్ట్రాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్ తరాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. సీపీఐ ఎన్టీఆర్‌జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ, పీపీపీ పేరుతో అభివృద్ధి జరుగుతుందని చంద్రబాబు వక్రభాష్యం చెబుతున్నారని, వాస్తవంగా డబ్బున్నవారిదే రాజ్యం అనే పరిస్థితి నెలకొని పేదవారికి కనీస విద్య,వైద్యం అందని పరిస్థితి నెలకొందన్నారు. నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వైద్యకళాశాలలను పేద విద్యార్థులకు అందుబాటులో ఉంచాలని, వాటిని ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు వి.జాన్స న్‌బాబు మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్య కళాశాలల విలువైన భూములతో సహా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకంగా పెద్దఎత్తున ఉద్యమించినట్లు, రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఎన్నికల సమ యంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ నిర్వహించిన యువ గళం సందర్భంగా ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. పీపీపీ విధానం పేరుతో వైద్య విద్యను విక్రయించే ప్రయత్నాన్ని అడ్డుకుంటామని పునరుద్ఘాటించారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ, పీపీపీ అంటే ప్రజల ఆస్తులను ప్రయివేటు వ్యక్తులకు దారాదత్తం చెడమేనని, దానికి వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలకు తమ కార్మిక సంఘం నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ధర్నాలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.వి.భాస్కరరావు. తాడి పైడయ్య, మూలి సాంబశివరావు, అప్పురుబోతు రాము, కొట్టు రమణారావు, సంగుల పేరయ్య, కార్యవర్గ సభ్యులు డి.వి .రమణబాబు, తూనం వీరయ్య, కోడలి ఆనందరావు, దోనేపూడి సూరిబాబు, సింగరాజు సాంబశివరావు, బుడ్డే రాజా, మందలపు శ్రీనివాస్, కె.ఆర్ ఆంజనేయులు , దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర నాయకులు కరవది సుబ్బారావు, బుట్టి రాయప్ప, ఇన్సాఫ్ రాష్ట్ర కన్వీనర్ సయ్యద్ అఫ్సర్, విజయవాడ ఏఐవైఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల భార్గవ్, లంకా గోవిందరాజులు, ఏఐఎస్‌ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, జగదీశ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర అధ్యక్షులు ఓర్సు భారతి, ఆటో కార్మిక సంఘ నేత గూడేల జనార్దన్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చీర్ల రామస్వామి, బెవర శ్రీను, హ్యాకర్స్ యూనియన్ క్రిష్ణ, మారుతీ, మల్లేశ్వరి, ముఠాకార్మిక సంఘనాయకులు కాకి శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, బోను శ్రీరాములు పళ్ళ ముఠా నాయకులు విద్యార్థులు, వివిధ ప్రజా సంఘాల నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రానాయక్, ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాలు ఆలపించారు.

# అనంతలో టీడీపీ వర్సెస్ బీజేపీ


**అనంతపురం :** అనంతపురం జిల్లాలోని రాయదుర్గంలో టీడీపీ, బీజేపీల మధ్య రాజకీయ యుద్ధం జరుగుతుంది. బీజేపీ నేత కాపు రామచంద్రారెడ్డి ముందస్తు వ్యూహంతో వెళుతున్నట్లే కనిపిస్తుంది. బీజేపీలో ఉన్నప్పటికీ ఆయన మనసంతా వైసీపీలో ఉన్నట్లే కనిపిస్తుంది. రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి బీజేపీలో చేరారు. అయితే ఆయన వ్యవహారశైలిని చూస్తుంటే బీజేపీలో ఎక్కువ రోజులు ఉండేటట్లు కనిపించడం లేదు. తన మైనింగ్ వ్యవహారాలను కాపాడుకోవడానికే బీజేపీలో చేరారని టీడీపీ ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు వంటి వారు విమర్శిస్తున్నారు. ఆయన అక్రమంగా గనులను తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఇటీవల టీడీపీ నేతలు ఆందోళనకు కూడా దిగారు. కానీ కాపు రామచంద్రారెడ్డి మాత్రం వైసీపీలో ఉన్నవారందరికీ బీజేపీ కండువాలను కప్పుతున్నారు.కాపు రామచంద్రారెడ్డి రాయదుర్గం నియోజకవర్గం నుంచి మూడు సార్లు గెలుపొందారు. 2009లో గెలిచిన కాపు 2012లో జరిగిన ఉపఎన్నికలలో గెలుపొందారు. తిరిగి 2019 లో గెలిచారు. రాయదుర్గం నుంచి గెలుస్తూ వస్తున్న కాపు రామచంద్రారెడ్డికి గత ఎన్నికల్ల వైఎస్ జగన్ టిక్కెట్ ఇవ్వలేదు. దీంతో కాపు రామచంద్రారెడ్డి బీజేపీలో చేరారు. కానీ బీజేపీలో చేరినప్పటికీ అక్కడ కూటమి నేతలకు మధ్య పొసగడం లేదు. టీడీపీ వర్సెస్ బీజేపీగా రాయదుర్గం నియోజకవర్గంలో నడుస్తుంది. వైసీపీ ఇక్కడ కొంత సైలెంట్ గా ఉన్నప్పటికీ ప్రధానంగా బీజేపీ, టీడీపీ ల మధ్య వైరం కొనసాగుతున్నట్లు కనిపిస్తుంది. కాల్వ శ్రీనివాసులు, కాపు రామచంద్రారెడ్డి లు గత కొన్ని ఎన్నికల్లో వేర్వేరు పార్టీల నుంచి పోటీ చేయడంతో కూటమి పార్టీలో ఉన్న సయోధ్య కుదరలేదు.ఇక్కడ కూటమి తరుపున ఏ కార్యక్రమం జరిగినప్పటికీ టీడీపీ, బీజేపీ లు




ఎడమొఖం,పెడముఖంలానే ఉన్నాయి. ప్రభుత్వ కార్యక్రమాల్లో టీడీపీ నేతలతో పాటు బీజేపీ నేతలు పాల్గొనడం లేదు. అయితే కాపు రామచంద్రారెడ్డి కేవలం తన గనుల తవ్వకాల కోసమే తాత్కాలికంగా బీజేపీ పంచన చేరారని, ఎన్నికలకు ముందు తిరిగి వైసీపీలోకి వెళ్లడం ఖాయమని టీడీపీ నేతలు చెబుతున్నారు. అటువంటి నేతకు ఎందుకు ప్రాధాన్యత ఇస్తున్నారని కొందరు టీడీపీ నేతలు బీజేపీ రాష్ట్ర నాయకత్వానికి కూడా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయినా బీజేపీ నేతలు మాత్రం పట్టించుకోకపోవడంతో రాయదుర్గం నియోజకవర్గంలో టీడీపీ వర్సెస్ బీజేపీ అన్న రీతిలోనే కార్యక్రమాలు సాగుతున్నాయి. బీజేపీ నేత కాపు రామచంద్రారెడ్డి కి వ్యతిరేకంగా టీడీపీ నేతలు నిరసన ప్రదర్శనలు కూడా చేస్తుండం రాయదుర్గం నియోజకవర్గం ప్రత్యేకత.

# బుల్లెట్ ట్రైన్ పై అప్ డేట్...

**తిరుపతి :** ఏపీ మీదుగా హైస్పీడ్ బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం కసరత్తు జరుగుతోంది. హైదరాబాద్ - బెంగళూరు మార్గంలో బుల్లెట్ రైలు నడపాలనే ఆలోచనలో కేంద్రం ఉంది. అందులో భాగంగా ఈ మార్గంలో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో మంగళవారం భూ పరీక్షలు నిర్వహించారు. ప్రతిపాదిత బుల్లెట్ రైల్వే లైన్ అనంతపురం జిల్లా మీదుగా వెళ్లే అవకాశం ఉండటంతో.. నిపుణులు పలుచోట్ల మట్టిని సేకరించి.. పరీక్షలు నిర్వహించారు ఆంధ్రప్రదేశ్‌లో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు దిశగా కసరత్తు జరుగుతోంది. ఏపీలో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు దిశగా అధికారులు చర్యలు ప్రారంభించారు. దక్షిణాదిలో పెద్ద నగరాలైన హైదరాబాద్ - బెంగళూరు, అలాగే హైదరాబాద్ - చెన్నై నగరాల మధ్య బుల్లెట్ రైలు నడపాలని కేంద్రం భావిస్తోంది. అందుకు అనుగుణంగా ఈ మార్గాల్లో బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రచిస్తున్నారు. హైదరాబాద్ - బెంగళూరు బుల్లెట్ రైల్వే లైన్ ఏపీలోని అనంతపురం జిల్లా మీదుగా వెళ్తుంది. అలాగే హైదరాబాద్ - చెన్నై బుల్లెట్ రైల్వే లైన్ గుంటూరు జిల్లా మీదుగా వెళ్లేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ - బెంగళూరు హైస్పీడ్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం అధికారులు




కసరత్తు మొదలెట్టారుఅందులో భాగంగా అనంతపురం జిల్లాలో పరీక్షలు నిర్వహించారు. హైస్పీడ్ రైల్నే లైన్ ఏర్పాటు కోసం భూసామర్థ్యాన్ని నిర్ధారించేందుకు అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రోజున మట్టి పరీక్షలు చేశారు. అనంతపురం రూరల్ మండలం, బుక్కరాయసముద్రం మండలంలోని కొన్ని గ్రామాలతో పాటుగా, సిద్దరాంపురం పరిసరాల్లో నిపుణుల బృందం మట్టి పరీక్షలు నిర్వహించింది. 40 పాయింట్ల వద్ద నుంచి మట్టి నమూనాలను సేకరించినట్లు సమాచారం. మరోవైపు దక్షిణాదిలోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతిలను అనుసంధానం చేస్తూ బుల్లెట్ రైలు ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు గత కొంతకాలంగా కేంద్రానికి ప్రతిపాదిస్తున్నారు. ఈ బుల్లెట్ రైల్వే లైన్ ఏర్పాటు కోసం సర్వే కూడా మొదలైందని ఇటీవల సీఎం చంద్రబాబు వెల్లడించారు. విశాఖపట్నంలో జరిగిన ఇండియా ఫుడ్ మ్యానుఫ్యాక్చరింగ్ సమ్మిట్ 2025లో భాగంగా చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. త్వరలోనే దక్షిణ భారతదేశానికి కూడా బుల్లె?ట్ రైలు వస్తుందని చంద్రబాబు ఈ సందర్భంగా వెల్లడించారు. సర్వే కూడా పూర్తైందని.. హైదరాబాద్, చెన్నై, అమరావతి, బెంగళూరును కలుపుతూ దీనిని ఏర్పాటు చేస్తారని చంద్రబాబు చెప్పుకొచ్చారు.ఈ నాలుగు నగరాల జనాభా కోట్లల్లో ఉందన్న చంద్రబాబు.. వీటిని అనుసంధానం చేస్తే ప్రపంచంలోనే అతిపెద్ద క్లస్టర్‌గా, అతిపెద్ద మార్కెట్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే బుల్లెట్ రైలు వస్తే దక్షిణాది ప్రాంత అభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతుందని అభిప్రాయపడ్డారు. మరోవైపు మన దేశంలో తొలి బుల్లెట్ రైలును ముంబయి-అహ్మదాబాద్ మధ్య ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే దక్షిణాదిలోనూ బుల్లెట్ రైలు ఏర్పాటు చేస్తే.. నాలుగు ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గుతుందని... వాణిజ్యం, వ్యాపారం. వర్తకం, సాంస్కృతిక, పర్యాటకంగా నాలుగు ప్రాంతాల మధ్య సంబంధాలు మరింత బలోపేతమవుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

## ఉద్యమానికి నాంది!

-మొదటిపేజీ తరువాయి

ఆకర్షణగా నిలిచాయి. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించేందుకు ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు పార్టీ నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు, కీలక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వాహనాలు ర్యాలీగా విజయవాడలోని లోక్ భవన్‌కు చేరుకున్నాయి. అనంతరం శుక్రవారం సాయంత్రం గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి ప్రభుత్వ మెడికల్ కళాశాలపై ప్రైవేటీకరణపై జోక్యం చేసుకోవాలని ఈ సందర్భంగా వైఎస్ జగన్ కోరారు.

## డిసెంబర్ 21న తిరుమలలో పల్స్ పోలియో

**అంకుశం న్యూస్ తిరుమల డిసెంబర్ 18** దేశవ్యాప్త కార్యక్రమంలో భాగంగా తిరుమలలో డిసెంబర్ 21వ తేదీ పల్స్ పోలియో కార్యక్రమం జరగనుంది.ఐదేళ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమం డిసెంబర్ 21న ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుంది. భక్తుల సౌకర్యార్థం తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అశ్విని ఆసుపత్రి, ఆర్టీసీ బస్టాండ్, జీఎన్సీ టోల్ గేట్, సిఆర్‌ఓ, పీఏసీ 1 మరియు 2, కొత్త బస్టాండ్, హెల్త్ ఆఫీస్, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -1 మరియు 2, ఏటీసీ, ఎంబీసీ-34, వరాహస్వామి విశ్రాంతి గృహం 1, రాంభగీచా రెస్ట్ హౌస్ 1, కల్యాణకట్ట, మేదరమిట్ట, పాపవినాశనం, సుపథం, బాలాజీ నగర్ వినాయక ఆలయం, బాలాజీ నగర్ బాలబడి, ఎస్వీ హై స్కూల్, తిరుమల ఆలయం లోపల మరియు వెలుపల, ఉద్యోగుల డిస్పెన్సరీల వద్ద పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేస్తారు. ఇందులో భాగంగా 20వ తేది ఉదయం 10 గంటలకు ఎస్వీ హైస్కూల్ నుంచి బాలాజీ నగర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి యాత్రికులు మరియు స్థానికుల కొరకు జీపులో ప్రకటనలు చేస్తూ అవగాహన కలిగించనున్నారు.

## చంద్రబాబు గ్రాఫ్ డౌన్.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

**(అంకుశం, అమరావతి, డిసెంబర్ 18):** చంద్రబాబు గ్రాఫ్ డౌన్ అవుతోంది. దీంతో పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. చేసేది ఏమీలేక ఈ నెపాన్ని చంద్రబాబు కలెక్టర్లపై నెడుతున్నారని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాల అధ్యక్షులు, కో ఆర్డినేటర్లు, సీనియర్ నేతలతో తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వైఎస్ జగన్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబునాయుడు నోట్లోంచి కలెక్టర్ల సదస్సులో వచ్చిన మాటలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. ప్రజల్లో తన గ్రాఫ్ పడిపోతోంది. దానికి కారణం కలెక్టర్ల పనితీరు సరిగ్గా లేదని ఆయన చెబుతున్నారు. 'అది కలెక్టర్ల గ్రాఫ్ బాగాలేక కాదు స్వామి.. నీ గ్రాఫ్ బాగాలేక పడిపోతోంది. అది నీకు అర్థం కావడం లేదు. నీ హయాంలో నువ్వు వచ్చిన తర్వాత ప్రజలకు ఏదైనా మంచి జరిగిందా అంటే ఒకటీ మంచి జరగలేదు'.

మన ప్రభుత్వ హయాంలో క్యాలెండర్ ప్రకటించి, అన్ని స్కీమ్‌లు పక్కాగా అమలు చేశాం. ఏ నెల ఏ స్కీమ్ ఇవ్వబోతున్నాం?. ఏ నెల ఏ బటన్ నొక్కబోతున్నాం.. అని ప్రజలకు ముందుగానే క్యాలెండర్ ఇచ్చి, పక్కాగా అమలు చేశాం. కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్‌ఆర్‌సీపీ చేపట్టిన ప్రజా ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉద్యమంలో భాగంగా తలపెట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు, ముందుకొచ్చి సంతకాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏకంగా 1,04,11,136 సంతకాలు సేకరించడం జరిగింది. ఇది ఒక చరిత్ర అని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్' అవార్డు..

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రికి ఈ అవార్డు రావడం గర్వకారణమని అన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ... ఈ అవార్డు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని, 'ఎకనామిక్ టైమ్స్' హెడ్డింగ్ చూస్తేనే గూస్‌బంప్స్ వస్తున్నాయని వ్యాఖ్యానించారు. "గతంలో రాష్ట్రం దాదాగిరిని చూసింది, ఇప్పుడు అభివృద్ధి వైపు పరుగులు పెట్టే నాయుడుగిరిని చూస్తోంది" అని అన్నారు. ఇప్పటివరకు కేంద్రంలో ఉన్నవారికే ఈ పురస్కారం దక్కిందని, తొలిసారిగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి లభించడం ఇదే ప్రథమమని వివరించారు. అనంతరం సీఎం చంద్రబాబు స్పందిస్తూ... ఈ ఘనత తనది కాదని, తన సహచరులు, అధికారులు, కలెక్టర్లదేనని అన్నారు. తాను సాధారణంగా అవార్డులు స్వీకరించనని, గతంలో విదేశీ యూనివర్సిటీలు డాక్టరేట్లు ఇస్తామన్నా సున్నితంగా తిరస్కరించానని గుర్తుచేశారు. "గత ప్రభుత్వంలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. ఇప్పుడు గేర్ మార్చి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం. 18 నెలల్లో 25 కొత్త పాలసీలు తెచ్చాం" అని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదని అన్నారు. పారిశ్రామిక ప్రోత్సాహకాల కోసం దేశంలోనే తొలిసారిగా ఎస్క్రో ఖాతాను తీసుకొస్తున్నామని, పాలనలో కూడా 'స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్' అమలు చేయాలని నిర్ణయించామని వెల్లడించారు.

## పోలీసింగ్ అంటే భయం ఉండాలి

-మొదటిపేజీ తరువాయి





కుమార్ గుప్తా. ఎన్టీఆర్, పశ్చిమగోదావరి జిల్లాల సహా ఐదు జిల్లాల్లో సీసీటీవీల అనుసంధానంతో నేరాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయని వెల్లడి. డీహెచ్‌ఎంఎస్ అనే ఆధునిక సాంకేతికత ద్వారా సీసీ కెమెరాల హెల్త్ ను నమోదు చేస్తున్నామన్న విజయవాడ సీపీ రాజశేఖర బాబు. నగరంలో నిఘా కోసం 10 వేల సీసీ కెమెరాల డ్యాష్ బోర్డును కమ్యూనిటీ సహకారంతో రూపొందించామని చెప్పిన విజయవాడ సీపీ. ఫేస్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా నిందితుల్ని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పిన రాజశేఖర్ బాబు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ....కొన్ని జిల్లాల్లో క్రై మ్ రేటు ఎక్కువగా ఉంది మరికొన్ని చోట్ల తక్కువగా ఉంది. రాష్ట్రంలో శాంతిభద్రతలే ప్రభుత్వానికి ముఖ్యం. కడప, అల్లూరి, ఏలూరు జిల్లాల్లో ప్రాపర్టీ సంబంధిత కేసులు ఎక్కువగా ఉండటానికి కారణం ఏమిటో విశ్లేషించండి. రాష్ట్రంలో 5.5 శాతం మేర నేరాల రేటు తగ్గింది... కానీ జిల్లాల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉంది. అన్నమయ్య, కోనసీమ, నెల్లూరు, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో ఎందుకు నేరాలు పెరిగాయో విశ్లేషించండి అని సూచించారు. 22ఏ భూముల వివాదాల పరిష్కారానికి హై ప్రయార్టీ ఇవ్వాలని సీఎం సూచించారు.

వచ్చే కలెక్టర్ల కాన్ఫరెన్స్ సమావేశంలో 22ఏ భూముల వివాదాల పరిష్కారంపైనే మొదటి అజెండాగా చేపడతామన్న సీఎం చంద్రబాబు. విశాఖపట్నంలో కొన్ని భూ వివాదాల్లో కొందరి రాజకీయ నాయకుల ప్రమేయం ఉంటోందనే అంశంపై తనకు ఫిర్యాదులు అందాయని సీఎం దష్టికి తెచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. భూవివాదాల్లో పొలిటికల్ నేతల జోక్యాన్ని ఎంత మాత్రమూ సహించొద్దని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు సీఎం చంద్రబాబు ఆదేశం. భూవివాదాల్లో రాజకీయ నేతలు జోక్యం చేసుకున్నారనే ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేసిన ముఖ్యమంత్రి 2019%-%24లో భూ రికార్డులు అస్తవ్యస్తం చేశారు. తమకు దక్కాల్సిన భూములు దక్కకుంటే... వాటిని లిటిగేషనులో పెట్టేందుకు భూములన్నీ 22ఏలో పెట్టి వివాదంలోకి నెట్టారు. గత పాలనలో అస్తవ్యస్త పరిస్థితుల వల్ల ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు అన్నీ భూ వివాదాలకు సంబంధించే వస్తున్నాయి. భూ సమస్యలను వందశాతం పరిష్కరించి ప్రజలకు సవ్యంగా డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన బాధ్యత కలెక్టర్లదే. కొందరు ప్రొఫెషనల్స్ కావాలనే ఈ భూవివాదాలు సష్టించే ప్రయత్నం చేస్తున్నారు...అవసరమైతే పీడీ యాక్టు పెట్టి కఠినంగా వ్యవహరించండి. పీ4 ద్వారా జీరో పావర్టీ లక్ష్యాన్ని సాధించటంతో పాటు ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఫ్యామిలీ కార్డు జారీ , ప్రజారోగ్యం తదితర అంశాలపై ప్రజెంటేషన్లు. రాష్ట్రంలో నీటి భద్రత పై ప్రత్యేక దృష్టిపెట్టాలని సీఎం సూచనలు చేశారు.

# డాక్టర్ రామసుబ్బయ్య మృతి

- ఆయన మృతి మమ్మల్ని కలిచివేసింది.. పరిటాల సునీత, శ్రీరామ్
- పరిటాల రవీంద్ర వర్ధంతి సమయంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు





**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 18 :**అనంతపురం జిల్లాలో వైద్యఅభివృద్ధిలో విశేష సేవ చేసిన డాక్టర్ రామసుబ్బయ్య నిన్న మరణించారు రామసుబ్బయ్య మరణంతో అనంతపురం జిల్లాలో డాక్టర్లు మేధావులు ప్రజలు ప్రజాప్రతినిధులు తండోపతండాలుగా వచ్చి ఆయనకు నివాళు లర్పించారు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు రామసుబ్బయ్య మరణం తీరం లోటు అని అభివర్ణించారు రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత పరిటాల శ్రీరామ్ అనంతపురం శాసనసభ్యులు దగ్గుబాటి ప్రసాద్ సురేంద్రబాబు ఇతర ప్రజాప్రతినిధులు ఆయన ఇంటికి వెళ్లి వారి కుటుంబంలో సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వైద్యరంగంలో విశేషమైన సేవలందించిన డాక్టర్ రామసుబ్బయ్య గారి మరణం వ్యక్తిగతంగా తమ కుటుంబానికి తీరని లోటని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. డాక్టర్ రామసుబ్బయ్య మరణంపై వారు విచారం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని.. అలాగే వారి కుటుంబసభ్యులు దీని నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే సమయంలో డాక్టర్ రామసుబ్బయ్య గారితో వారికున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పరిటాల రవీంద్ర మరణం తర్వాత ఆయన వర్ధంతికి అనేక సార్లు వెంకటాపురంలో రెడ్ క్రాస్ సొసైటీ తరుపున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో తమకు వచ్చిన గుర్తింపుకు ప్రధానమైన కారణం డాక్టర్ రామసుబ్బయ్య అన్నారు. ఆయన జిల్లా వైద్య రంగానికి అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా ఉంటాయని సునీత, శ్రీరామ్ అన్నారు...

# ప్రజా సమస్యలు పరిష్కరించి ప్రభుత్వ ప్రతిష్ట పెంచండి

- అందుకే ప్రతి వారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం
- క్యాంప్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ లో పరిటాల సునీత
- కార్యకర్తలతో సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకున్న సునీత






**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 18:** రాప్తాడు నియోజకవర్గం లో ప్రజల కోసం పనిచేస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించి ప్రభుత్వ ప్రతిష్టను పెంచాలని కార్యకర్తలకు నాయకులకు రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీత సూచించారు. ప్రజలు ఎక్కడా ఇబ్బందులు పడుకూడదని.. ఎప్పటికప్పుడు వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే తమ ప్రభుత్వ తొలి ప్రధాన్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలు చెప్పుకున్నారు. ప్రతి ఒక్కరితో ఓపిగ్గా మాట్లాడి.. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతపురం రూరల్ మండలంలోని ఏ.నారాయణపురం పంచాయతీ నుంచి పాపంపేట పంచాయతీని ప్రత్యేక పంచాయతీగా చేయాలని ఎమ్మెల్యే సునీతకు స్థానికులు విజ్ఞప్తి చేశారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. ఆత్మకూరు మండలం పి.కొత్తపల్లి గ్రామంలో బీసీ కమ్యూనిటీ భవనం, మారెమ్మ అమ్మవారి దేవాలయానికి కాంపౌండ్ వాల్ నిర్మాణం, భజన మందిరం కావాలని విన్నవించారు. సనప గ్రామంలో సిసి రోడ్లు కావాలని, మదిగుబ్బ గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, మదిగుబ్బ తండా వరకు ఉన్న బి.టి రోడ్డు చెరువులో పాడైంది అది మరమ్మతులు చేయించాలని కోరారు. అలాగే తండాలో వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేయాలని సిసి రోడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పంపనూరు గ్రామంలో సిసి రోడ్లు, సచివాలయమునకు కాంపౌండ్ వాల్, ఆంజనేయస్వామి భజన మందిరం కోసం అర్జీలు ఇచ్చారు. భూముల మ్యుటేషన్ గురించి విజ్ఞప్తి చేయగా.. తహసిల్దార్ తో మాట్లాడి సమస్య పరిష్కరించాలని సూచించారు. హౌసింగ్, పింఛన్ల కోసం అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ స్థానికంగా ఉన్న అధికారులు ప్రజల సమస్యలపై వెంటనే స్పందిస్తే.. అవి మా వరకు రావన్నారు. కొన్ని చోట్ల సచివాలయం స్థాయిలోనే పరిష్కారమయ్యేవి ఉన్నాయన్నారు. ప్రజలు ఇచ్చిన అర్జీ గురించి వారికి సాధ్యాసాధ్యాలపై క్షుణ్ణంగా వివరించాలన్నారు. ఒక చిన్న నిర్లక్ష్యమే కొన్ని సార్లు పెద్దవి అవుతాయన్నారు. భూముల మ్యుటేషన్లకు సంబంధించి ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినా.. కొన్ని చోట్ల ఇంకా నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. మరోవైపు కార్యకర్తల సమావేశంలో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు ఏవైనా ఇబ్బందులు ఉంటే.. నేరుగా నన్నే కలవాలన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ఏ ఒక్కరికి అన్యాయం జరగదని. వివిధ రూపాల్లో వారికి న్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నామని ఎమ్మెల్యే సునీత అన్నారు...

## పారిశ్రామిక అభివృద్ధికి కొత్త ఊపిరి

- రేమండ్స్ గ్రూప్ జె.కె. మైని కంపెనీతో జిల్లా అధికారుల సమావేశం



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, డిసెంబరు 18:** శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గారి ఆదేశాల మేరకు.. గురువారం పుట్టపర్తిలోని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయంలో రేమండ్స్ గ్రూప్‌కు చెందిన జె.కె. మైని కంపెనీ ప్రతినిధులతో జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భాగంగా గుడిపల్లి పారిశ్రామిక వాడ మరియు టేకులోడు పారిశ్రామిక వాడలలో ప్రెసిషన్ ఇంజనీరింగ్ మరియు గ్లోబల్ ఏరోస్పేస్ రంగాలలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు, అలాగే నైపుణ్యం కలిగిన యువతకు కల్పించబోయే ఉద్యోగ అవకాశాలపై కంపెనీ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పరిశ్రమల స్థాపనకు అవసరమైన వివిధ రకాల అనుమతులు (అప్రూవల్స్), ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు (ఇన్సెంటివ్స్), అలాగే జిల్లాలోని ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుకున్న యువతకు కల్పించబోయే ఉపాధి అవకాశాలపై స్పష్టమైన అవగాహన కల్పించారు. జె.కె. మైని కంపెనీ ప్రతినిధులు 2027 జనవరి నాటికి తొలి దశలో ఉత్పత్తి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ఈ పరిశ్రమల ద్వారా జిల్లాలో స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ ప్రియా మనోజ్, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ రాఘవేంద్ర, స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తేజ్ కుమార్ పాల్గొన్నారు.

## తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి క్యాష్ కౌంటింగ్ మిషన్ విరాళం

**అంకుశం న్యూస్ తిరుపతి డిసెంబర్ 18:** తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి తిరుచానూరు కెనరా బ్యాంక్ ప్రతినిధులు గురువారం క్యాష్ కౌంటింగ్ మిషన్ ను విరాళంగా ఆలయంలో అందించారు. ఈ మేరకు క్యాష్ కౌంటింగ్ మిషన్ ను ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ హరీంద్రనాథ్ కు కెనరా బ్యాంక్ ప్రతినిధులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో టిటిడి ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ మునిచెంగల్ రాయలు, ఇతర అధికారులు కెనరా బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంచొరవ చూపుతోంది

- అంగన్వాడీలకు సెల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్
- ధర్మవరంలో అంగన్వాడీ కార్యకర్తలకు సెల్ ఫోన్లు పంపిణీ చేసిన శ్రీరామ్





**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 18:** గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన అంగన్వాడీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం పని చేస్తోందని ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన 5జీ మొబైల్ ఫోన్లను ధర్మవరం పట్టణంలో అంగన్వాడీలకు ఆయన అందజేశారు. ధర్మవరం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ధర్మవరం పట్టణం, ధర్మవరం రూరల్ మండలంలోని 230 మంది అంగన్వాడి కార్యకర్తలు, 8మంది సూపర్వైజర్లకు సెల్ ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో అంగన్వాడీలకు ఈ సెల్ ఫోన్లు అందజేస్తున్నారన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలను అందించడం, పిల్లల పోషణ, బరువు, ఎత్తు కొలతలు వంటి వాటిని నమోదు చేయడానికి ఈ సెల్ ఫోన్లు ఉపయోగపడుతాయన్నారు. ప్రతి రోజూ బాల సంజీవని, పోషణ్ ట్రాకర్, మాతృవందన యోజన.. తదితర యాప్ ల ఆధారంగా సౌకర్యవంతంగా విధులు నిర్వర్తించాలనే ఆలోచనతో ప్రభుత్వం సెల్ ఫోన్లు అందజేస్తోందన్నారు. మూడేళ్లు దాటిన తర్వాత పిల్లలకు భోజనం తినడం దగ్గర నుంచి అన్నీ నేర్పేది అంగన్వాడీలేనన్నారు. చిన్నపిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు క్రమం తప్పకుండా ప్రభుత్వం నుంచి వచ్చే వాటిని అందించాలన్నారు. ఎక్కడైనా కాలం చెల్లిన వాటిని వినియోగిస్తే.. దాని ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందన్నారు. ఇది మొత్తం వ్యవస్థకే చెడ్డ పేరు తెస్తుందన్నారు. అలాగే బాల్య వివాహాలు నివారణపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతుందని పరిటాల శ్రీరామ్ అన్నారు...

## ధర్మవరం లో చేనేత గజానాణ్య పట్టు సాలి సంఘం సమావేశం!

- గౌరవ అధ్యక్షులు పల్లెం వేణు గోపాల్...

**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 18:** ధర్మవరం లో చేనేత ప్రాచీన సంస్కృతి కల గజానాణ్య పట్టు సాలి సంఘం ప్రత్యేక సమావేశం నేసే పేట శమీనారాయణ స్వామి ఆలయం లో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు పల్లెం వేణుగోపాల్ మాట్లాడుతూ శ్రీ రామ నామ సప్తహం ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించడం జరుగు తుందని అదేవిదంగా కామన్నపండుగ, శ్రీ లక్ష్మి చెన్న కేశవ స్వామి వారి రథోత్సవం, కళ్యాణ ఉత్సవం, వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు వంటి వి నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అదేవిదంగా 60 పై బడిన వారిని సన్మానం చేశామన్నారు. అందరూ కుల భా%శీ%దవులు అందరూ సమైక్యత ముందుకు ప్రగతి సాదించాలన్నారు. పలువురు చేనేత మహిళలను సన్మాంచారు.



## శింగనమల క్రాస్ వద్ద వాహనాల అండర్‌పాస్ ఏర్పాటు చేయండి

- కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కి వినతిపత్రం అందజేసిన ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ..



**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 18:** అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలు అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. న్యూఢిల్లీలో గురువారం అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ, శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణి జాతీయ రహదారి NH-544D పై కొనసాగుతున్న అభివృద్ధి పనుల సందర్భంగా శింగనమల క్రాస్ వద్ద వాహనాల అండర్‌పాస్ (VUP) ఏర్పాటు చేయాలనే కీలక అంశంపై కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కి వినతిపత్రం అందజేశారు.

- ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, రైతులు, వ్యాపారులు ప్రతిరోజూ ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రమాదాల ముప్పును దృష్టిలో ఉంచుకొని, శింగనమల క్రాస్ వద్ద అండర్‌పాస్ అత్యవసరమని, ప్రజలు సురక్షితంగా, సులభంగా రాకపోకలు సాగించేందుకు ఇది ఎంతో అవసరమని సంబంధిత అధికారుల దృష్టికి అనంతపురం ఎంపీ, శింగనమల ఎమ్మెల్యే తీసుకెళ్లారు.లిఅనంతరం ఈ అంశంపై కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గారికి కూడా వినతిపత్రం సమర్పించగా, కేంద్ర మంత్రి సమస్య ప్రాధాన్యతను గుర్తించి NHAI అధికారులతో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. శింగనమల నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల భద్రత కోసం అవసరమైన ప్రతి అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా కృషి చేస్తామని ఎంపీ తెలిపారు.

## రామవరం SC కాలనీలో గత 20 యేళ్ళ నుండి నివాసం ఉంటూ ఇంటి పట్టా మిస్సయిన వారికి నూతన పట్టా మంజూరు

- 32 మంది నివాసితులకు మీూా నల్లమిల్లి చేతుల మీదుగా ఇంటిపట్టాలు అందజేత



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 18:** కీశే నల్లమిల్లి మూలారెడ్డి హయాంలో రామవరం SC కాలనీలో ఇళ్ళ పట్టాలు ఇవ్వడం జరిగింది. అయితే కాలక్రమంలో కొంతమంది ఆ ఇంటిపట్టాలు పోగొట్టుకుని ఇబ్బందులు పడుతుండటం MLA నల్లమిల్లి దృష్టికి వచ్చింది దాంతో వారికి ఇబ్బందులను తొలగించాలనే ఉద్దేశ్యంతో MLA నల్లమిల్లి ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయితీరాజ్ తదితర అన్ని శాఖల నుండి సమగ్ర సర్వే నిర్వహించి పరిశీలన చేసి గడచిన 20-25 యేళ్ళుగా నివాసం ఉంటూ పట్టాలు మిస్ అయిన వారు ఎవరైతే ఉన్నారో వారికి నివేశన స్వాధీన ధృవీకరణ పత్రాలను నేడు రామవరంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామవరం గ్రామ కూటమి నాయకులు,కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



## అనపర్తిలో కబ్జాల పితామహుడు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి




**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 18:** అనపర్తి నియోజకవర్గంలో కబ్జాలకు పర్యాయపదంగా మారిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అని మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. ద్వారపూడి సమీపంలోని వేములపల్లి గ్రామంలో సుమారు 10 ఎకరాల అసైన్డ్ భూమిని అక్రమంగా కబ్జా చేసి, అక్కడ పౌల్ట్రీ ఏర్పాటు చేయడం ద్వారా ఎమ్మెల్యే వందల కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. ఇంతటి అక్రమాలకు పాల్పడిన వ్యక్తి ఇప్పుడు నీతులు మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అధికార బలంతో అబద్ధపు ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. GBR కాలేజీ విషయంలో కూడా ఎమ్మెల్యే అసత్య ప్రచారం చేస్తున్నారని, విద్యార్థినీ - విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్న ఆ విద్యాసంస్థ మీద బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 30 మందికి రూ.9 లక్షల సీఎం రిలీఫ్ చెక్కుల పంపిణీ

- సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేద కుటుంబాలకు భరోసా
- సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కాలువకు లబ్ధిదారుల కృతజ్ఞతలు..





**అంకుశం న్యూస్ రాయదుర్గం డిసెంబర్ 18:** పేదరికంతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యం చేయించుకోలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో దోహదపడుతోందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు అన్నారు.గురువారం తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు 30 మందికి రూ.9 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ముఖ్యంగా బళ్లారి, బెంగళూరు సహా కర్ణాటక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చికిత్స చేయించుకున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా గణనీయమైన ఊరట లభించిందని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ అందుకున్న కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ సహాయం తమకు మరచిపోలేని మద్దతుగా నిలిచిందని పేర్కొన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో ఇప్పటివరకు 210 మందికి రూ.1,67,67,944 మొత్తాన్ని ఈ ఏడాదిన్నర కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందించామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా వందల కోట్ల రూపాయలు పేద కుటుంబాలకు ఈ పథకం ద్వారా అందుతున్నాయని తెలిపారు. చెక్కులు అందుకున్న కుటుంబాలు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గారికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## వాట్సాప్ గవర్నెన్స్ 'మన మిత్ర'లో

# ఎఫ్ ఐ ఆర్ డౌన్‌లోడ్ సౌకర్యం

- పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే ఎఫ్ ఐ ఆర్ ప్రతిని పొందవచ్చని జిల్లా ఎస్పీ పి. జగదీష్ వెల్లడి
- జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ఈ మేరకు సూచనలు జారీ
- పారదర్శకతతో పాటు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించడానికి మనమిత్ర సేవలు ఉపయోగపడుతాయి
- జిల్లా ఎస్పీ పి.జగదీష్





**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం డిసెంబర్ 18:** ప్రజలకు మరింత సులభమైన, వేగవంతమైన మరియు పారదర్శకమైన పోలీస్ సేవలు అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ – " మన మిత్ర" సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు...ప్రతి FIR ఎఫ్ ఐ ఆర్నమోదు అనంతరం ఫిర్యాదుదారులు తమ FIR ఎఫ్ ఐ ఆర్ ప్రతిని పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సులభంగా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు.

**FIR డౌన్‌లోడ్ విధానం:**

ఫిర్యాదుదారు 95523 00009 నంబర్‌ను తన మొబైల్‌లో సేవ్ చేసి వాట్సాప్‌లో '»Hi" పంపాలి.

అవసరమైన వివరాలను నమోదు చేసి FIR ప్రతిని వెంటనే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ సేవల ద్వారా ప్రజలకు సమయం ఆదా కావడంతో పాటు, పోలీస్ సేవల్లో మరింత పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. జిల్లా పరిధిలోని అన్ని పోలీస్ అధికారులు ఈ సేవపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించామని... ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ జగదీష్ కోరారు.

# వైద్య కళాశాల పిపిపి విధానాన్ని రద్దు చేయాలి

- అనంతలో కదం తొక్కిన ఎర్రసైన్యం
- ఎన్నికలలో హామీ ఇచ్చి మాట తప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్
- పేదలకు వైద్య విద్య దూరం ప్రజారోగ్యానికి ముప్పు
- సిపిఐ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయం వద్ద భారీ ఎత్తున ధర్నా





**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 18 :** రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలలో పిపిపి విధానాన్ని రద్దు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు అనంతపురం నగరంలో కలెక్టరేట్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు,, పిపిపి విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు భారీకేట్లు ఎక్కి కలెక్టరేట్లోకి చుచుకెళ్లేందుకు ప్రయత్నం చేశారు పోలీసులు వారిని అడ్డుకున్నారు.ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పి నారాయణస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్ జిల్లా కార్యదర్శి జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున రాజారెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పైన మండిపడ్డారు. ప్రతిపక్షంలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం వైద్య విద్యకు పేదలకు దూరం చేసే పద్ధతుల్లో 107 108 జీవోలను తీసుకువచ్చి వైద్య విద్యను 50% ప్రైవేటీకరణ చేస్తే అప్పటిలో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ గగ్గోలు పెట్టి పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న వైఎస్ఆర్సిపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి మన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే వంద రోజుల్లో 107 108 జీవోలను రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తవుతున్నప్పటికీ ఇచ్చిన హామీలలో భాగంగా జీవోలను రద్దు చేయకపోగా 100% వైద్య విద్యను పిపిపి విధానంలో ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. పిపిపి విధానం వల్ల కేవలం వైద్య విద్యార్థుల నష్టపోవడంతో పాటు సామాన్య ప్రజలు వైద్యం ఉచితంగా చేపించుకోవాల్సినటువంటి పరిస్థితి ఉండదన్నారు. వైద్య కళాశాల రాష్ట్రానికి వస్తే దాని పక్కనే ఒకటి ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాట అవుతుంది దానివల్ల సామాన్య ప్రజలు వైద్యం అందించుకోవడానికి అవకాశం ఉంటుంది. పిపిపి విధానం వల్ల పేదలకు విద్యతోపాటు వైద్యం కూడా దూరం చేసేటువంటి పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి సహాయ కార్యదర్శిలు మల్లికార్జున రాజారెడ్డి నగర కార్యదర్శి శ్రీరాములు కార్యదర్శి వర్గ సభ్యులు గోపాల్ టి నారాయణస్వామి పద్మావతి జిల్లా కార్యవర్గ సభ్యులు రమణయ్య రాజేష్ రమేష్ నాగార్జున కుల్లాయిస్వామి సంతోష్ కుమార్ పెద్దయ్య నగర సహాయ కార్యదర్శి కృష్ణుడు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు హనుమంతు రాయుడు రూరల్ మండల కార్యదర్శి నరేష్ ఏఐఎస్ఎఫ్ నాయకులు ఆంజనేయులు నరసింహ వెంకట్ నాయక్ మంజు వంశీ చందు నాని అఫన్ సన్నీ సిపిఐ నాయకులు ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విజయవాడ రైల్వే మౌలిక వసతుల కల్పించండి

- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తో ఎంపీ కేశినేని శివనాథ్, భేటీ
- గొల్లపూడి లోని బల్బ్ లైన్ల వద్ద శాటిలైట్ / హాల్ట్ రైల్వే స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదన
- ఎంపీ కేశినేని శివనాథ్ అభ్యర్థనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్





**అంకుశం ప్రతినిధి విజయవాడ డిసెంబర్ 18:** విజయవాడ పార్లమెంటు నియోజకవర్గంలో రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల మెరుగుదల లక్ష్యంగా ఎంపీ కేశినేని శివనాథ్ అడుగులు వేస్తున్నారు. పార్లమెంట్ హౌస్ లో గురువారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను ఆయన కార్యాలయంలో ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ కలవటం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ని సత్కరించారు.అనంతరం ఎన్టీఆర్ జిల్లాలో రోడ్డు%-%రైలు సమన్వయంతో కూడిన సమగ్ర రవాణా ప్రణాళికను అమలు చేయాల్సిన అవసరం గురించి, జిల్లాలో పెరుగుతున్నరైల్వే రవాణా రద్దీ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు ప్రణాళిక పై , కొండపల్లి- విజయవాడ రైల్వే ట్రాక్ వెంట నీటి నిల్వ సమస్యల పరిష్కారం పై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో కూలంకుషంగా చర్చించారు. ఈ సందర్భంగా విజయవాడ రైల్వే స్టేషన్‌పై ఉన్న అధిక రద్దీని తగ్గించేందుకు గొల్లపూడి లోని బల్బ్ లైన్ల పరిధిలో శాటిలైట్ / హాల్ట్ రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ ప్రాంతం రైల్వే అవసరాల కోసం భూసేకరణకు అనుకూలంగా ఉందని, ప్రధాన రహదారులు, విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం, అలాగే రాబోయే అమరావతి న్యూ రైల్వే లైన్‌కు సమీపంలో ఉండటం వల్ల ఇది భవిష్యత్ రాజధాని అభివృద్ధికి కీలక కేంద్రంగా మారే అవకాశముందని వివరించారు. .శాటిలైట్ రైల్వే స్టేషన్ ఏర్పాటుతో అమరావతి న్యూ రైల్వే లైన్, అవుటర్ రింగ్ రోడ్లు వంటి అభివృద్ధి మౌలిక వసతులకు మెరుగైన అనుసంధానం కలగడమే కాకుండా, ప్రస్తుతం విజయవాడ రైల్వే స్టేషన్‌పై ఉన్న రద్దీ గణనీయంగా తగ్గుతుందని తెలిపారు. ప్రజల సౌకర్యం, ప్రయాణికుల అవసరాలు, సరుకు రవాణా లాజిస్టిక్స్‌ను దృష్టిలో ఉంచుకుని సంబంధిత శాఖలతో కలిసి సంయుక్త తనిఖీ నిర్వహించి, ఫీజిబిలిటీ రిపోర్ట్‌తో పాటు వివరమైన ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని ఎంపీ కోరారు.

# తైక్వాండో క్రీడఅభివృద్ధి కి సహకరిస్తాం

- క్రీడలు భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయ్..!లి
- మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏపీ ఒలంపిక్ అసోసియేషన్
- జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభించిన.. మచ్చా రామలింగారెడ్డి








**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి అనంతపురము డిసెంబర్ 18:** టైక్వాండో క్రీడాభివృద్ధికి ఒలంపిక్ అసోసియేషన్ సంపూర్ణ సహకారం అందిస్తుందని టైక్వాండో క్రీడను అభివృద్ధి చేయాలనినేటి యువత క్రీడలు తప్పకుండా ఆడాలని క్రీడల్లో ఆడడం ద్వారా ఆరోగ్యంగా ఉండడంతో పాటు బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని మచ్చా రామలింగారెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ అన్నారు అనంతపురం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో గురువారం జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాచ్చా రామలింగారెడ్డి ఉపాధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ అసోసియేషన్ పాల్గొన్నారు సభ అధ్యక్షుడిగా గురుస్వామి కార్యదర్శి జిల్లా తైక్వాండ్ అసోసియేషన్ వ్యవహరించారు. తైక్వాండో జిల్లా స్థాయి పోటీలను మచ్చా రామలింగారెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ చిన్నారులు క్రీడల్లో పాల్గొనడం వలన వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తాయని నేటి సమాజంలో క్రీడలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని, ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో శిక్షణ మొదలు పెట్టాలి అన్నారు. తైక్వాండో క్రీడకు ప్రత్యేకత ఉందని, ఇది ఆత్మ రక్షణతో బాటు క్రీడా రిజర్వేషన్ కు కూడా ఉపయోగపడుతుంది అన్నారు. తైక్వాండోలో ప్రతిభ కనబరిస్తే ఉన్నత చదువులతో బాటు ఉద్యోగాల్లో రిజర్వేషన్ సంపాదించవచ్చు అన్నారు. క్రీడాకారులు జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయిలో రాణించి అనంతపురం జిల్లా ఖ్యాతిని పెంచాలని సూచించారు ఆధునిక కాలంలో పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను, జిల్లా తైక్వాండో అసోసియేషన్ సభ్యులను అభినందించారు. డిఎస్డిఓ మంజుల మాట్లాడుతూ తైక్వాండో సాధనకు ఇది సరయిన వయస్సు అని, ఈ వయస్సు నుంచి క్రమం తప్పక సాధన చేస్తే భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవచ్చు అన్నారు. చిన్న వయస్సు నుంచే ప్రోత్సాహాన్ని అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులను అభినందించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గురుస్వామి మాట్లాడుతూ ఈ పోటీలకు సబ్ జూనియర్, క్యాడెట్ విభాగాల నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొనడం ఈ పోటీల్లో మొదటి స్థానాలు సాధించిన సబ్ జూనియర్ క్రీడాకారులు జనవరిలో జరుగు 39వ అంతర్ జిల్లాల తైక్వాండో పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ పోటీలు విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన సీనియర్ శిక్షకులు కేశవయ్య, వెంకటేశులు, మనీంద్ర, కృష్ణ బాబులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అభినందించింది

## అంగరంగ వైభవంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి తృతీయ బ్రహ్మోత్సవాలు

- మురళీమోహన్ రైస్ ఇండస్ట్రీ అధినేత చిం తా వీర రాఘవ రెడ్డి దంపతులను ఆశీర్వదిస్తున్న వేద పండితులు





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ డిసెంబర్ 18:** కోరిన కోరికలు తీర్చే స్వామిగా పేరుందిన బలభద్రపురం గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి తృతీయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు, తూర్పు తిరుమలేశ్వరుని బ్రహ్మోత్సవాలు సందర్భంగా ఆలయం పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు, బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, శ్రీ మురళీమోహన్ ఇండస్ట్రీ అధినేత చిం తా సాయి వీర రాఘవరెడ్డి సుధా దంపతులు, కేపిఆర్ వ్యాపార సంస్థల అధినేత కే ముకుంద రెడ్డి దంపతులు, తేతల వీర వెంకట సత్యనారాయణ రెడ్డి అరుణ దంపతులు, తోపాటు వివిధ రంగాల చెందిన ప్రముఖులు దంపతుల చేతుల మీదుగా కళ్యాణం కార్యక్రమం నిర్వహించారు, వైకానస పీఠం పర్యవేక్షకులు వాడపల్లి గోపాల ఆచార్యులు ఆధ్వర్యంలో కృష్ణమాచార్యుల పర్యవేక్షణలో వేద పండితుల మంత్రాల మధ్య కళ్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, తిరుమలలో నిర్వహించే పద్ధతిలోనే తూర్పు తిరుమలేశారునికి కళ్యాణ్ కార్యక్రమం నిర్వహించారు, ఆలయ మూలవిరాట్ కు ప్రధాన అర్చకులు పెద్దింటి రామగోపాల ఆచార్యులు, వేదాంతం పవన్ కుమార్ ఆచార్యుల చే ప్రత్యేక అలంకరణ నిర్వహించి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు, ఆలయ కమిటీ తరఫున నల్లమిల్లి రామచంద్రారెడ్డి నాగలక్ష్మి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు, వెంకటేశ్వర స్వామి కి స్వయంగా బ్రహ్మ కళ్యాణం నిర్వహించడం వల్ల బ్రహ్మోత్సవాలగా పేరు ప్రఖ్యాతిగాంచిందని వేద పండితులు తెలిపారు, భగవ దర్పణం చేయడం ద్వారా ప్రశాంత జీవనం మోక్షం లభిస్తుంది అన్నారు, ఈనెల 23వ తేదీ మంగళవారం వరకు బ్రహ్మోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు, తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు తో పాటు సాయంత్రం వివిధ వాహనాలలో స్వామి అమ్మవార్లను మాడవీధులలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు, స్వామి అమ్మవార్లను దర్శించుకుని అన్న ప్రసాదంతో స్వీకరించి స్వామి అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని కోరారు .దర్శనానికి ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు, యువ వ్యాపారవేత్త చిం తా పాండురంగారెడ్డి ( జూనియర్), పడాల సుబ్బారెడ్డి, కొవ్వూరి కోటేశ్వర్ రెడ్డి, ఓగిరెడ్డి వెంకటరామారెడ్డి, గుడిమెట్ల విశ్వనాథరెడ్డి, తేతల రామారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాప్తాడు నియోజకవర్గంలో దేవాలయాలు అభివృద్ధి చేస్తాం


- పంపనూరు ఆలయ అభివృద్ధికి రూ.12 కోట్ల
- పండమేటి ఆలయ అభివృద్ధికి రూ.3-6కోట్లతో అంచనాలు
- క్యాంప్ కార్యాలయంలో రెండు ఆలయాల సభ్యులతో పరిటాల సునీత సమావేశం



**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 18:** రాప్తాడు నియోజకవర్గంలోని పలు ప్రముఖ ఆలయాల అభివృద్ధి దిశగా అడుగులు పడుతున్నాయి. ఎమ్మెల్యే పరిటాల సునీత ఇందుకోసం ప్రత్యేకంగా చొరవ తీసుకుంటున్నారు. తాజాగా అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ తో పాటు పండమేరు శ్రీ వెంకటరమణస్వామి దేవస్థానం కమిటీ సభ్యులతో సమావేమయ్యారు. ఆలయాల వారిగా చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. దేవాదాయ శాఖ నుంచి నిధులు ఎంత తీసుకురావాలన్న దానిపై సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో పంపనూరు ఆలయ అభివృద్ధికి రూ.12కోట్ల వరకు అంచనాలు సిద్ధం చేశారు. పండమేరు ఆలయానికి సుమారు రూ.3నుంచి రూ.6కోట్ల వరకు ఖర్చవుతుందని ప్రతిపాదించారు. ఈ అంచనాలతో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని కలవాలని నిర్ణయించారు. ఆలయ కమిటీ సభ్యులు, అధికారులతో పాటు గ్రామ పెద్దలతో కలిసి శుక్రవారం రోజు దేవాదాయశాఖ మంత్రిని కలవాలని ఎమ్మెల్యే సునీత తెలిపారు. కచ్చితంగా మంత్రి నుంచి సానుకూల స్పందన వస్తుందని.. రెండు ఆలయాలను రానున్న రోజుల్లో ఎవరూ ఉహించని విధంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు...

## డాక్టర్ రామసుబ్బయ్య మరణం వైద్య రంగానికి తీరని లోటు

- మెడికల్ కళాశాల స్థాపనలో ఆయనది కీలక పాత్ర.. ఎమ్మెల్యే దగ్గుపాటి
- ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాం



**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 18:** డాక్టర్ రామసుబ్బయ్య గారి మరణం వైద్య రంగానికి, అనంతపురం జిల్లాకు తీరని లోటని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. రామసుబ్బయ్య గారి మరణ వార్త తెలిసిన తర్వాత చాలా బాధ కల్గించిందన్నారు. వైద్య రంగంలో ఆయన అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డికి వ్యక్తిగత వైద్యులుగా కూడా ఆయన పని చేశారన్నారు. అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల స్థాపన కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. వైద్య రంగాన్ని ఆయన వ్యాపార దృక్పతంతో పాటు కాకుండా సేవా రంగంగా చూశారన్నారు. ఆయన్ని ఆదర్శంగా తీసుకుని ఎంతో మంది వైద్యులు ప్రజలు సేవలందించారన్నారు. అలాంటి వైద్యున్ని కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు..

## డిసెంబరు 29 నుండి జనవరి 2వ తేదీ వరకు శ్రీకపిలేశ్వరాలయంలో తెప్పోత్సవాలు

**అంకుశం న్యూస్ తిరుపతి డిసెంబర్ 18:** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో డిసెంబరు 29 నుండి జనవరి 2వ తేదీ వరకు తెప్పోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. ఐదు రోజులపాటు జరిగే తెప్పోత్సవాలలో మొదటిరోజైన డిసెంబరు 29వ తేదీన శ్రీ వినాయక స్వామివారు, శ్రీ చంద్రశేఖర్ స్వామివారు పుష్కరిణిలో 9 చుట్లు విహరిస్తారు. నవంబరు 30న శ్రీ వళ్ళి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామివారు 9 చుట్లు, డిసెంబరు 31న శ్రీ సోమస్కందస్వామివారు 9 చుట్లు, జనవరి 1న శ్రీ కామాక్షి అమ్మవారు 9 చుట్లు, జనవరి 2న శ్రీ చండికేశ్వరస్వామివారు మరియు చంద్రశేఖర స్వామివారు తెప్పలపై 9 చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు ఊంజల సేవ, తెప్పోత్సవాలు నిర్వహిస్తారు. జనవరి 3వ తేదీన ఆరుద్ర దర్శన మహోత్సవం సందర్భంగా ఉదయం 6 నుండి రాత్రి 9 గంటల వరకు శ్రీ నటరాజస్వామివారు, శ్రీ శివగామి అమ్మవారు, శ్రీ మాణిక్యవాసగ స్వామివారి ఉత్సవ విగ్రహాలను పురవీధులలో ఊరేగించనున్నారు. తెప్పోత్సవాల సందర్భంగా టిటిడి అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ భక్తి సంకీర్తనలు ఆలపిస్తారు.